స్ట్రాంగ్ రూంల పరిశీలన

ఎదులాపురం, మే 21 : జిల్లా కేంద్రంలోని టీటీడీసీ, సంజయ్ గాంధీ పాల్‌టెక్నిక్ కళాశాల, సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల్లో ఆదిలాబాద్ పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన ఈవీఎంలను భద్రపరిచారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్, రిటర్నింగ్ అధికారి రాజర్షి షా పరిశీలించారు. భద్రతా సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం సీసీ కెమెరాలు, రిజిస్టర్‌ను పరిశీలించారు.

సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న కలెక్టర్, రిటర్నింగ్ అధికారి రాజర్షి షా

పెన్షన్ దుర్వినియోగంపై విచారణ చేపట్టాలి

భైంసాటౌన్, మే 21 : పెన్షన్ దుర్వినియోగంపై విచారణ చేపట్టాలని బాధిత కుటుంబ సభ్యులు మంగళవారం ఎంపీడీవో సుధాకర్‌రెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. తిమ్మాపూర్‌కు చెందిన ముత్తన్న 2022 సెప్టెంబర్‌లో మృతి చెందాడు. అదే సంవత్సరం నవంబర్‌లో పెన్షన్ తీసుకున్నట్టు ఉందని కుటుంబీకులు తెలిపారు. అలాగే గజ్జారాం సెప్టెంబర్ 2020లో మృతి చెందగా.. అదే సంవత్సరం అక్టోబర్‌లో పెన్షన్ డబ్బులు తీసుకున్నట్టు ఉందని తెలిపారు. ముత్తన్నవి ఆరు నెలలు, గజ్జారాంవి మూడు నెలల పెన్షన్ డబ్బులు రూ.18 వేలు దుర్వినియోగం అయినట్లు వారు తెలిపారు. దుర్వినియోగంపై విచారణ జరిపి న్యాయం చేయాలని బాధిత కుటుంబీకులు వినతిపత్రంలో విన్నవించారు. ఈ విషయమై ఎంపీడీవోకు వివరణ కోరగా విచారణ జరుపుతామని తెలిపారు.

ఎంపీడీవోకు వినతిపత్రాన్ని అందజేస్తున్న పెన్షనర్ల కుటుంబ సభ్యులు

క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

యువత క్రీడల్లో రాణించాలి..

- బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్

నేరడిగొండ, మే 21 : గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని యువత క్రీడల్లో రాణించాలని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహిస్తున్న నేరడిగొండ ప్రీమియర్ లీగ్ పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాథోడ్ సజన్, వీడీసీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ దేవేందర్‌రెడ్డి, నాయకులు సద్దాం, సురేందర్, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణ, లక్ష్మణ్, శేఖర్, క్రీడల నిర్వాహకులు పవన్‌కుమార్, జట్ల కెప్టెన్లు లఖన్, యోగి, మణిరాజ్, హరీశ్, జకి, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

రాజీనామా పత్రాన్ని చైర్మన్ సత్యంకు అందజేస్తున్న మున్సిపల్ కౌన్సిలర్ ఆఫిన బేగం

మున్సిపల్ చైర్మన్‌పై కౌన్సిలర్ అసంతృప్తి

- రోడ్డు అక్రమణలపై పలుమార్లు ఫిర్యాదు
- పట్టించుకోక పోవడంతో పదవికి రాజీనామా

ఖానాపూర్, మే 21 : కొత్తగా ఏర్పాటైన ఖానాపూర్ మున్సిపాలిటీలో పాలకవర్గ సభ్యులు, స్థానిక ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం పట్టణంలోని రోడ్లపై కొనసాగుతున్న అక్రమణలపై అసంతృప్తి వ్యక్తం చేస్తు ఆరో వార్డు కాంగ్రెస్ కౌన్సిలర్ ఆఫ్రినబేగం తన పదవికి రాజీనామా చేశారు. మున్సిపాలిటీలో అభివృద్ధే ధ్యేయంగా పనులు చేపడుతుంటే చైర్మన్ సత్యం, కమిషనర్ మనోహర్ అడ్డుకుంటున్నారని వాపోయారు. ఆరో వార్డు పరిధిలోని లింగాపూర్ అడ్డా, పాత బస్టాండు, అంగాడి బజార్ ప్రాంతంలో అక్రమంగా వెలిసిన కట్టడాలను తొలిగించాలని ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. దీంతో తాను కౌన్సిలర్ పదవిలో ఉండి వార్డు అభివృద్ధి, ప్రజలకు మేలు చేయడం లేకపోతున్నని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ భర్త అమానుల్లాఖాన్, కమిషనర్ మనోహర్ పాల్గొన్నారు.

సమీక్ష నిర్వహిస్తున్న నిర్మల్ కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

కొనుగోళ్లను వేగవంతం చేయాలి

నిర్మల్ కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

నిర్మల్ టౌన్, మే 21 : ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ధాన్యం కొనుగోళ్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈనెల 31వ తేదీలోగా ధాన్యం కొనుగోలు ప్రక్రియను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ధాన్యం తడవకుండా టార్పాలిన్‌లు, గన్నీ బ్యాగ్స్ అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్, డీఆర్డీవో విజయలక్ష్మి, డీఎస్‌వో శ్రీకళ, జిల్లా వ్యవసాయశాఖ అధికారి అంజిప్రసాద్, డీసీవో నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం తరలింపులో జాప్యం చేయద్దు

ధాన్యం తరలింపులో అధికారులు జాప్యం చేయవద్దని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. పట్టణంలోని మంజులాపూర్‌లో గల ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన వెంట జిల్లా అధికారులు నందిత, శ్రీకళ, విజయలక్ష్మి ఉన్నారు.

పోస్టుకార్డులతో ప్రధానమంత్రికి ఉత్తరాలు రాసి పంపుతున్న బోగీల సాధన సమితి సభ్యులు

సాధారణ బోగీలను పెంచాలి..

ప్రధానమంత్రి మోదీకి కోటి ఉత్తరాలతో విజ్ఞప్తి

ఎదులాపురం, మే 21 : ప్రతి రైలులో అదనంగా ఐదు సాధారణ బోగీలను పెంచాలని, ఇందుకోసం ప్రధానమంత్రి మోదీకి దేశవ్యాప్తంగా కోటి ఉత్తరాలతో విజ్ఞప్తి చేస్తున్నామని రైలులో ఐదు సాధారణ బోగీల సాధన సమితి జాతీయ కన్వీనర్ పరికిపండ్ల అశోక్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఉత్తరాలు పంపే బృహత్తర కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనరల్ బోగీల్లో ప్రయాణించే సామాన్యుల పరిస్థితి దయనీయంగా ఉందని, సీట్లు తక్కువగా ఉండడం, బోగీల్లో స్థలం లేకపోవడం, తొక్కిసలాటలు, గాయాలు కావడం, చిన్నారులు ప్రాణాలు కోల్పోయిన సందర్భాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఇటీవల మహబూబాబాద్‌లో కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కుతూ దళిత మహిళ కిందపడి చంకలో ఉన్న పాపతోపాటు కడుపులో ఉన్న పిండాన్ని కూడా కొల్పోవడం బాధకరమన్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక వేత్తలు మంచికట్ల ఆశమ్మ, కుర్ర నరేశ్, దొంతుల ప్రవీణ్‌లు పాల్గొన్నారు.

బోనస్.. బోగస్..

- సన్నాలకే రూ.500 చెల్లిస్తామనడంపై ఆగ్రహం
- కాంగ్రెస్ ప్రభుత్వం హామీని తుంగలో తొక్కిందంటున్న రైతులు

ఉట్నూర్‌లో రైతులు పండించిన దొడ్డు వడ్లు

ఆదిలాబాద్, మే 21(నమస్తే తెలంగాణ) : రైతులు పండించిన ధాన్యానికి రూ.500ల బోనస్ చెల్లించి కొనుగోలు చేస్తామని ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని అమలు చేయకపోవడంపై రైతన్నలు మండిపడుతున్నారు. ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూర్ ప్రాంతంతోపాటు నిర్మల్ జిల్లాల్లో వానకాలం, యాసంగిలో అధికంగా దొడ్డు వడ్లు సాగవుతాయి. కేసీఆర్ సర్కారు రైతులు పండించిన పంట ఉత్పత్తులను ప్రభుత్వం కొనుగోలు చేసింది. కరోనా సమయంలో కూడా రైతులు నష్టపోకుండా గ్రామాల్లో కాంటాలను ఏర్పాటు చేసి ధాన్యాన్ని సేకరించింది. డబ్బులను కూడా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డి ధాన్యానికి రూ.500లు చెల్లించి కొనుగోలు చేస్తామని ప్రకటించడంతో రైతులు సంతోషించారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇప్పుడు రైతులను పక్కదారి పట్టిస్తున్నది. కేవలం సన్నరకం వడ్లకే రూ.500 బోనస్ వచ్చే వానకాలం నుంచి చెల్లిస్తామని ప్రకటించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దొడ్లు వడ్లకు రూ.2,100 మద్దతు ధర ఉండగా.. సన్న వడ్లకు రూ.3వేల నుంచి రూ.3,500 ధర పలుకుతున్నది. దీంతో రైతులు సన్న వడ్లను ప్రభుత్వ కేంద్రాల్లో విక్రయించే పరిస్థితి ఉండదు. ధాన్యానికి బోనస్ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అన్ని రకాల వడ్లకు బోనస్ చెల్లించాలి..

కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల్లో భాగంగా రైతులు పండించిన ధాన్యానికి రూ.500 బోనస్ చెల్లించి కొనుగోలు చేస్తామని ప్రకటించింది. ఇప్పుడు సన్నవడ్లకే బోనస్ ఇస్తాం అంటూ మాటమార్చే ప్రయత్నం చేస్తున్నది. ఎన్నికలప్పుడు ఒక మాట, ఆ తర్వాత ఒక మాట మాట్లాడడం రైతులను మోసం చేయడమే. రెండు సీజన్‌లలో వరి పండిస్తాం. ఎక్కువగా దొడ్లు వడ్లను సాగు చేస్తాం. సన్న వడ్లను తినడానికి మాత్రమే పండిస్తాం. సన్న వడ్లకు బయట మంచి ధర ఉంది. రూ.3 వేలకు పైగా చెల్లించి వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. దొడ్డు వడ్లకు రూ.2100 మద్దతు ధర ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం దొడ్డు వడ్లను కొనుగోలు చేయకపోతే రైతుల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుంది.

- వెంకటిరెడ్డి, రైతు, కజ్జర్ల, తలమడుగు

దిలావర్‌పూర్‌లోని కొనుగోలు కేంద్రంలో గల ధాన్యాన్ని పరిశీలించడానికి వస్తున్న బీఆర్ఎస్ నాయకులు

రూ.500 చెల్లించాల్సిందే..

- అన్ని రకాల వడ్లకు ఇవ్వకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తాం..
- దొడ్డు రకం పండించే వారు రైతులు కారా?
- అమలుకు నోచుకోని హామీలిచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్
- బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రం ముట్టడి

దిలావర్‌పూర్, మే 21 : వరి పండించే రైతులందరికీ క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లించాల్సిందేనని, లేనియెడల బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతుల తరపున పోరాటం ఉధృతం చేస్తామని నిర్మల్ నియోజకవర్గ సమన్వయకర్త రాంకిషన్‌రెడ్డి అన్నారు. మంగళవారం రాష్ట్ర బీఆర్ఎస్ పార్టీ ఆదేశాల మేరకు మండల కేంద్రమైన దిలావర్‌పూర్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పార్టీ నాయకులు రైతులతో కలిసి ముట్టడించారు. అనంతరం కొనుగోలు కేంద్రంలోని ధాన్యం కుప్పలను పరిశీలించి అక్కడున్న రైతులతో మాట్లాడారు. అనంతరం రాంకిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ సర్కారు ప్రతి ధాన్యం గింజను, తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశాడు. అసెంబ్లీ ఎన్నికల్లో క్వింటాలు ధాన్యానికి బోనస్‌గా రూ.500 చెల్లిస్తామని గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పుడు సన్న రకం వడ్లకు మాత్రమే చెల్లిస్తామని చెప్పడం సిగ్గుచేటు అన్నారు. దొడ్డు రకం వరి సాగు చేసే వారు రైతులు కారా అని వారు ప్రశ్నించారు. రైతుల తరపున బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.

కొనుగోలు కేంద్రాల్లో దళారుల కంటే అధిక దోపిడీ

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో దళారుల కంటే అదిక దోపిడీ చేస్తున్నారని దిలావర్‌పూర్ బీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ ఏలాల చిన్నరెడ్డి అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతుల వద్ద నుంచి తేమ శాతం పరిశీలించి కొనుగోలు చేసినప్పుడు, 40 కిలోల బస్తాకు అదనంగా 3 కిలోలు ఎందుకు ఎక్కువగా తీసుకుంటున్నారని ప్రశ్నించారు. ఈ ధాన్యం డబ్బులు ఎవరు తీసుకుంటున్నారో రైతులకు చెప్పాలని డిమాండ్ చేశారు. ఒక్కొక్క రైతు నుంచి క్వింటాలుకు అదనంగా 6 నుంచి 7 కేజీలు ఎక్కువగా తీసుకుంటున్నారని, ఇది రైతులను దోచుకోవడం కాదా అని ప్రశ్నించారు. రైతుల తరపున బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ కో-ఆప్షన్ సభ్యులు సుభాష్‌రావు, గుండంపల్లి బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సంగెం గంగారెడ్డి, మాజీ సర్పంచ్‌లు సాయరెడ్డి, రాజు, విఠల్, నిర్మల్ పట్టణ పార్టీ అధ్యక్షుడు మారుకొండ రాము, మండల కో- ఆప్షన్ సభ్యులు అన్వర్ ఖాన్, వెంకగారి నర్సయ్య, బొల్ల ఆనందం, నర్సపూర్(జీ) మండల పార్టీ అధ్యక్షుడు సుదన్, నిర్మల్ మార్కెట్ కమిటీ సభ్యులు రాథోడ్ అశోక్, షేక్ అలీం, షేఖ్ రఫీ, శ్రీనివాస్, గోవిందుల మధు, రాజు పాల్గొన్నారు.

సమీక్ష నిర్వహిస్తున్న నిర్మల్ కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

సమయపాలన ఎక్కడ?

తహసీల్దార్ కార్యాలయంలో టైం పాటించని సిబ్బంది

***అది ఆదిలాబాద్ జిల్లా** బజార్‌హత్నూర్ తహసీల్దార్ కార్యాలయం. ఉదయం 11 గంటలు అవుతున్నది. 'నమస్తే తెలంగాణ' కార్యాలయానికి వెళ్లింది. స్టాఫ్ అందరూ ఉదయం 10.30 గంటలకు విధులకు రావాల్సి ఉండగా కొందరే వచ్చారు. ఇందులో అటెండర్ వికాస్, రికార్డు అసిస్టెంట్‌లు నరేశ్, ఆశతయి, కంప్యూటర్ ఆపరేటర్ ఆశన్న మాత్రమే ఉన్నారు. 11.05 గంటలకు జూనియర్ అసిస్టెంట్లు కరుణాకర్‌రెడ్డి, మెహరాజ్.. 11.15 గంటలకు సీనియర్ అసిస్టెంట్ విద్యాసాగర్‌రెడ్డి, సర్వేయర్ షరీఫ్.. 11.20 గంటలకు గిర్దావర్ మురళీధర్.. 11.30 గంటలకు జూనియర్ అసిస్టెంట్ వినోద్ వచ్చారు. ఎమ్మార్వో శంకర్ ఆదిలాబాద్ వెళ్లాడని, డిప్యూటీ తహసీల్దార్ హీరాలాల్ సెలవులో ఉన్నాడని అక్కడున్న సిబ్బంది తెలిపారు. కాగా.. సర్టిఫికెట్ల కోసం వివిధ గ్రామాల నుంచి ఉదయాన్నే వచ్చిన వారు అవస్థలు పడ్డారు. అధికారుల కోసం నిరీక్షిస్తూ కూర్చున్నారు. అధికారులు సమయపాలన పాటించకపోవడంపై ప్రజలు మండిపడుతున్నారు. ఈ విషయంపై తహసీల్దార్ శంకర్‌ను వివరణ కోరగా.. అందరూ సిబ్బంది సమయానికి వచ్చేట్టుగా చూస్తానని తెలిపారు.*

- బజార్‌హత్నూర్, మే 21

కార్యాలయం వద్ద అధికారుల రాక కోసం ఎదురుచూస్తున్న ప్రజలు


బజార్‌హత్నూర్ తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది రాకపోవడంతో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

వడదెబ్బతో ఉపాధి కూలీ మృతి

అంబటి కిష్టన్న(ఫైల్)

తాంసి(తలమడుగు), మే 21 : సుంకిడి గ్రామానికి చెందిన అంబటి కిష్టన్న(58) గత నెల 25న భీమన్న గుట్ట ప్రాంతంలో ఉపాధి హామీ పనులు చేస్తుండగా వడదెబ్బ తగలింది. దీంతో 108లో జిల్లాకేంద్రంలోని రిమ్స్ తరలించి చికిత్స అందించారు. 25 రోజులుగా రిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. కాగా.. మంగళవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పని ప్రదేశంలో సరైన వసతులు లేక వడదెబ్బ తగిలి మృతి చెందిన బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

డబుల్ బెడ్రూం ఇండ్లను ముట్టడించిన లబ్ధిదారులను ఖాళీ చేయాలని కోరుతున్న తహసీల్దార్

ఖాళీ చేయండి..

డబుల్ బెడ్రూంలను వీడకపోతే కేసులు చేస్తాం : తహసీల్దార్

దిలావర్‌పూర్, మే 21 : దిలావర్‌పూర్‌లో ఆరేండ్ల క్రితం నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్లను మంగళవారం కొందరు ఆక్రమించుకున్నారు. ఇందులోనే ఉంటామని ఇండ్ల ఎదుట బైఠాయించారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ స్వాతి, పోలీస్ అధికారులతో కలిసి వెళ్లారు. ఆక్రమించుకున్న వారు అధికారులతో వాగ్వాదానికి దిగారు. తమకు ఉండేందుకు ఇండ్లు లేవని అన్నారు. ఇవీ ప్రభుత్వ ఆధీనంలో ఉన్నాయని, తక్షణమే ఖాళీ చేసి వెళ్లిపోవాలని అధికారులు కోరారు. అయినా వినకుండా ధర్నాకు దిగారు. ఇండ్లను ఖాళీ చేయకుంటే కేసులు నమోదు చేస్తామని బెదిరించే ప్రయత్నం చేశారు. కేసులు నమోదు చేసినా వెళ్లిపోయేది లేదని భీష్మించుకు కూర్చున్నారు. సాయంత్రం వరకు అధికారులు వారిని వెళ్లగొట్టి గదులకు తాళం వేశారు.

నకిలీ విత్తన రవాణాపై నిఘా

నిర్మల్ ఎస్పీ జానకి షర్మిల

నిర్మల్ అర్బన్, మే 21 : నకిలీ విత్తనాలు విక్రయించే అక్రమార్కులపై పీడీ యాక్టు కింద కేసులు నమోదు చేస్తామని ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల ఒక ప్రకటనలో తెలిపారు. ధనార్జనే ధ్యేయంగా కొంత మంది ప్రముఖ బ్రాండెడ్ కంపెనీల పేరిట నకిలీ విత్తనాలు, కాలం చెల్లిన కంపెనీ విత్తనాలను రీసైక్లింగ్ చేస్తున్నారని తెలిపారు. రైతులు నకిలీ, కల్తీ విత్తనాల బారిన పడకుండా డీజీపీ ఆదేశాల మేరకు జిల్లా పోలీసు శాఖ విస్తృత తనిఖీలు చేస్తున్నదన్నారు. లైసెన్స్ లేకుండా విత్తనాలు విక్రయించే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అక్రమంగా రవాణ, సరఫరాను నిరోధించేందుకు ఇన్‌ఫార్మర్ వ్యవస్థను పటిష్టం చేసి, వీరిపై పీడీ యాక్టు అమలు చేస్తామన్నారు.

విత్తన డీలర్ల తనిఖీ

బజార్‌హత్నూర్ ఎరువుల దుకాణాలను తనిఖీ చేస్తున్న అధికారులు

గుడిహత్నూర్, మే 21 : గుడిహత్నూర్ మండలంలోని విత్తన డీలర్ల షాపులను మంగళవారం మండల వ్యవసాయాధికారి రేవతి, ఎస్ఐ సయ్యద్ ఇమ్రాన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వినియోగదారులకు పూర్తి వివరాలతో రసీదు ఇవ్వాలని సూచించారు. ఎంఆర్‌పీ రేటు కంటే అధిక ధరకు అమ్మితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా స్టాకు రిజిస్టర్‌ను పరిశీలించారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు

బజార్‌హత్నూర్, మే 21 : రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఏడీఏ శ్రీధర్‌స్వామి, వ్యవసాయధికారి ప్రమోద్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని దేగామ, భూతాయి, బజార్‌హత్నూర్, పిప్పిరి గ్రామాల్లోని ఫర్టిలైజర్, సీడ్ దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు రాము, కృష్ణపాల్, సంజీవ్ పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రుల సోదా

ప్రైవేటు ఆస్పత్రుల్లో తనిఖీ చేస్తున్న బృందం సభ్యులు

ఎదులాపురం, మే 21 : ఆదిలాబాద్ పట్టణంలోని భుక్తాపూర్‌లో గల మమత, జన్‌సిన్ దవాఖానల్లో వైద్యారోగ్యశాఖ ఏర్పాటు చేసిన ప్రత్యేక తనిఖీ బృందం సభ్యులు మంగళవారం ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. నిర్వహణ సక్రమంగా లేకపోవడం, ధరల పట్టికలు ఏర్పాటు చేయకపోవడం, అగ్నిమాపక రక్షణ, బయోవేస్ట్ నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఐడీఎస్పీ ప్రొగ్రాం ఆఫీసర్ అశోక్ మాట్లాడుతూ.. ప్రైవేట్ దవాఖానలు ప్రభుత్వ నిబంధనలు పాటించాలన్నారు. వైద్యులు, ఏఎన్ఎం, ల్యాబ్ టెక్నీషియన్ సర్టిఫికెట్లు ఆసుపత్రుల్లో ఉంచాలన్నారు. ఈ తనిఖీల్లో జూనియర్ అసిస్టెంట్ కిరణ్, డీఈవో రాంప్రసాద్, మాస్ మీడియా అధికారి వెంకట్‌రెడ్డిలు ఉన్నారు.